


RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ శుక్రవారం 02-08-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 203 పేజీలు : 4 వెల : రూ 2-00

PUBLISHED : NIZAMABAD FRIDAY 02 AUGUST 2024 EDITOR : BYAGAL SRINIVAS VOLUME : 06 ISSUE : 203 PAGES : 4 Rs : 2.00

## అసెంబ్లీలో స్పీకర్ ను నిలదీసిన అక్బరుద్దీన్ ఓవైసీ

హైదరాబాద్: శాసన సభను క్రమశిక్షణలో పెట్టడమో, లేదంటే సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వడమో, లేదంటే క్రమశిక్షణ ఉల్లంఘిస్తున్న వారిని సస్పెండ్ చేయడమో ఏదో ఒకటి చేయాలని ఎంఎంఐ శాసనసభ్యుడు అక్బరుద్దీన్ ఒవైసీ సభాధ్యక్షుడు గడ్డం ప్రసాద్ కుమార్‌ను కోరారు. ఇంతకీ ఏం జరిగిందంటే.. బిఆర్ఎస్ ఎంఎల్ఏ సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని సిఎం రేవంత్‌రెడ్డి అవమానించారని ఆరోపిస్తూ బిఆర్ఎస్ సభ్యులు ఈ రోజు సభలో వాయిదా తీర్మానం ఇచ్చారు. సభలో సబితకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని పట్టుబడుతూ నిరసన తెలిపారు. అదే సమయంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అధికారాన్ని రాష్ట్రాలకే ఇస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో ఈ అంశంపై చర్చించాలని సిఎం రేవంత్ కోరారు. దీంతో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. అక్బరుద్దీన్ ఒవైసీ వెంటనే లేచి మాట్లాడారు.

# ఉపకులాల వర్గీరణను సమర్థించిన ధర్మాసనం

### రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉందని వెల్లడి
### ఏడుగురు సభ్యుల సిజెఐ ధర్మాసనం సంచలన తీర్పు



న్యూఢిల్లీ,ఆగస్ట్1 ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు చారిత్రక తీర్పును వెల్లడించింది. ఎస్సీల ఉపవర్గీకరణకు రాష్ట్రాలకే అధికారం ఉందని, వారికే అవకాశం ఇవ్వాలని సర్వోన్నత న్యాయస్థానం తన తీర్పులో చెప్పింది. ఎస్సీ వర్గీకరణ చెల్లుబాటుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. ఎస్సీ వర్గీకరణ అంశంపై ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీంకోర్టులో 3 రోజుల పాటు విచారణ జరిగింది. వర్గీకరణ సమర్థనీయమేనని నాడు కేంద్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. సుదీర్ఘ వాదనల తర్వాత ఫిబ్రవరి 8న తీర్పును రిజర్వు చేసిన సుప్రీంకోర్టు.. తాజాగా నిర్ణయాన్ని వెల్లడించింది.. విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అవసరమని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం 6:1 నిష్పత్తితో తీర్పును వెల్లడించింది.. దీనివల్ల ఎస్సీ ఎస్టీలోని వెనుకబడిన ఉప కులాలకు లబ్ది చేకూరుతుందని అభిప్రాయపడింది. వర్గీకరణతో సమానత్వానికి భంగం వాటిల్లదని.. జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. వర్గీకరణతో ఆర్టికల్ 14లోని సమానత్వ హక్కుకు భంగం వాటిల్లదు.. వర్గీకరణ అనేది ఆర్టికల్ 341/2కి ఉల్లంఘన కాదు .. ఆర్టికల్ 15, 16లో వర్గీకరణ వ్యతిరేకించే అంశాలూ లేవని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల్లో క్రిమీలేయర్‌ను గుర్తించడానికి రాష్ట్రాలు.. ఒక నిర్దిష్టమైన విధానాలు తీసుకురావాలని.. జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. కాగా..వర్గీకరణపై 2 దశాబ్దాల క్రితం ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పక్కకుపెట్టింది. ఈ క్రమంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణపై సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లను ఉపవర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. ఈమేరకు 2004లో ఐదుగురు సభ్యులు ఇచ్చిన తీర్పును తాజాగా విస్తృత ధర్మాసనం పక్కనబెట్టింది. 6:1 మెజారిటీతో సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తుది తీర్పు వెలువరించింది. తాజా తీర్పును అనుసరించి ప్రభుత్వాలు దీనిపై తదుపరి మార్గదర్శకాలు రూపొందించుకోవాలని సూచించింది. వ్యవస్థాగతంగా ఎదుర్కొంటున్న వివక్ష కారణంగా ఎస్సీ,ఎస్టీ వర్గాల వారు పైకి రాలేక పోతున్నారు. ఒక కులంలో ఉపవర్గాలు చేసేందుకు రాజ్యాంగంలోని 14వ అధికరణ అనుమతి కల్పిస్తుంది. అందుకే 2004 నాటి ఈవీ చిన్నయ్య తీర్పును మేం వ్యతిరేకిస్తున్నాం. రాష్ట్రాలు ఉపవర్గీకరణ చేసుకునేందుకు అనుమతి కల్పిస్తున్నాం' అని సీజేఐ ధర్మాసనం స్పష్టంచేసింది. అణగారి న వర్గాల వారికి మరిన్ని ప్రయోజ నాలు కల్పించేందుకు రిజర్వ్‌డ్ కేటగిరీలో రాష్ట్రాలు ఉప వర్గీకరణ చేసుకోవచ్చని కోర్టు వెల్లడించింది. ధర్మాసనంలో దీనికి అనుకూలంగా ఆరుగురు న్యాయమూర్తులు తీర్పు చెప్పగా.. 50శాతాన్ని వాల్మీకి, మజహబీ సిక్కు సామాజికవర్గాలకు తొలి ప్రాధాన్యంగా ప్రత్యేకిస్తూ 2006లో పంజాబ్ ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. అయితే, ఎస్సీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణ చెల్ల దంటూ పంజాబ్, హరియాణా హైకోర్టు 2010లో తీర్పు వెలువరించింది. ఈవీ చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 2004లో వెలువరించిన తీర్పును ఉల్లంఘించేలా పంజాబ్ చట్టం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. షెడ్యూల్డ్ కులాల జాబితాలోకి ఏదైనా సామాజిక వర్గాన్ని చేర్చాలన్నా, తొలగించా లన్నా పార్లమెంటుకు మాత్రమే అధికారం ఉంటుందని, రాష్ట్రాల శాసనసభలకు కాదని ఈవీ చిన్నయ్య కేసులో సుప్రీంకోర్టు 2004లో తీర్పు చెప్పింది. దాన్నే పంజాబ్, హరియాణా తమ ఉత్తర్వులో హైకోర్టు ప్రస్తావించింది. దీంతో, హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పంజాబ్ ప్రభుత్వం అప్పట్లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అనంతరం దీనిపై మరో 22 పిటిషన్లు దాఖలయ్యాయి. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కూడా ఇందులో వ్యాజ్యదారుగా ఉన్నారు. ఈ పిటిషన్లను విచారించిన అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం.. 2020లో ఈ వివాదాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేసింది. దీనిపై సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం ఈ ఏడాది ఆరంభంలో విచారణ జరిపి తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఉపవర్గీకరణ చేసుకొనేలా రాష్ట్రాలకు అనుమతినిస్తూ గురువారం కీలక తీర్పు వెలువరించింది. విచారణ సమయంలో కేంద్రం కూడా ఎస్సీ,ఎస్టీలో ఉపవర్గీకరణను సమర్థించింది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ విజయం కోసమే 30 ఏండ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో చాలా మంది తమ ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ఉద్యమాలను దెబ్బతీసే కుట్రలు ఎన్నో జరిగాయని విమర్శించారు. అయినా సహనం కోల్పోకుండా పట్టుదలతో పోరాటం చేసి విజయం సాధించామని తెలిపారు. 1994లో ప్రకాశం జిల్లా ఈదుమూడిలో వర్గీకరణ ఉద్యమాన్ని ప్రారంభించామన్నారు. జాతికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు పోరాడామని అన్నారు. న్యాయం కోసం ఎమ్మార్పీఎస్‌కు అండగా నిలిచిన వారందరికీ ఈ విజయం అంకితం ఇస్తున్నామన్నారు. ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్లు కూడా సరిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వర్గీకరణకు జనాభా లెక్కలతో పనిలేదని చెప్పారు. వర్గీకరణ కోసం ప్రధాని మోదీ చొరవ తీసుకున్నారని చెప్పారు. అనుకూల తీర్పునిచ్చిన జడ్జిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఏనాటికైనా ధర్మమే గెలుస్తుందని 2004 నవంబర్ 5న చెప్పానని గుర్తుచేశారు. అలాగే సుప్రీంకోర్టు తీర్పుతో మంద కృష్ణమాదిగ భావోద్వేగానికి గురయ్యారు.. మీడియా ఎదుట కంటనీరు పెట్టుకున్న మంద కృష్ణ.. తమ 30 ఏళ్ల పోరాటానికి న్యాయం జరిగిందంటూ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు తీర్పు న్యాయాన్ని బతికించిందంటూ పేర్కొన్నారు. కోటాలో సబ్‌కోటాపై సుదీర్ఘకాలంగా కోర్టులో కేసులు ఉన్నాయి.. ఈ క్రమంలో ఉవవర్గీకరణ కోరుతూ ఎమ్మార్పీఎస్ సుప్రీంను ఆశ్రయించింది.. పంజాబ్ ప్రభుత్వం సైతం వర్గీకరణపై సుప్రీంలో కేసు వేసింది.. ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీంలో 3 రోజులు సుదీర్ఘ వాదనలు సైతం జరిగాయి. ఇదిలాఉంటే.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు హైదరాబాద్ మాదిగ విశ్వరూప సభలో ప్రధాని మోదీ సైతం వర్గీకరణకు అనుకూలంగా మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అని, సుప్రీం కోర్టులో కూడా వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని నాడు ప్రధాని మోదీ హామీ ఇచ్చారు.

# ఎస్సీ వర్గీకరణ తీర్పును స్వాగతిస్తున్నాం

### ఉద్యోగ నియామకాల్లో వర్గీకరణ అమలు
### అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ప్రకటన

హైదరాబాద్,ఆగస్ట్1(ఆర్ఎన్ఎ): ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీం తీర్పును సిఎం రేవంత్ రెడ్డి స్వాగతించారు. మాదిగ, మాదిగ ఉపకులాల యువకులు 27 ఏళ్లుగా పోరాటం చేశారని రేవంత్‌రెడ్డి అన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో శాసనసభలో సీఎం కీలక ప్రకటన చేశారు. ఇప్పుడు ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లలోనూ వర్గీకరణను అమలు చేసేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకుని వస్తామని అన్నారు. వర్గీకరణ కోసం గతంలో ఇదే శాసనసభలో వాయిదా తీర్మానం ఇచ్చాం. అప్పుడు నాతో పాటు సంపత్‌కుమార్‌ను సభ నుంచి బహిష్కరించారు. గత ప్రభుత్వం ఏబీసీడీ వర్గీకరణ అంశంపై ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తామని చెప్పింది. అలా తీసుకెళ్లకుండా మాదిగ సోదరులను మోసం చేశారు. డిసెంబర్ 3, 2023న ప్రజాప్రభుత్వం బాధ్యత తీసుకున్న తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచన మేరకు మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో శాసనసభ్యులు, అడ్వొకేట్ జనరల్ ను ఢిల్లీకి పంపించాం. న్యాయ కోవిదులతో చర్చించి వర్గీకరణపై సుప్రీంకోర్టులో బలమైన వాదనను కాంగ్రెస్ ప్రభుత్వం వినిపించింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు మాదిగ, మాదిగ ఉపకులాల వర్గీకరణకు అనుకూలమైన తీర్పు ఇచ్చింది. సుప్రీం రాజ్యాంగ ధర్మాసనానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. దేశంలోనే అందరికంటే ముందు భాగాన నిలబడి ఏబీసీడీ వర్గీకరణ చేసే బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. ఇప్పుడు ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లలోనూ వర్గీకరణను అమలు చేస్తాం.



దీనికి అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకొచ్చి మాదిగ సోదరులకు న్యాయం చేస్తాం. మాదిగ, మాదిగ ఉపకులాల వర్గీకరణకు సంపూర్ణంగా సహకరించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేస్తున్నాను అని సీఎం కోరారు. ఎస్సీ వర్గీకరణకు మాదిగ, మాల ఉప కులాలకు వర్గీకరణకువాయిదాతీర్మానం ఇస్తే గత ప్రభుత్వం సంపత్ కుమార్‌ను సస్పెండ్ చేసిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఏబీసీడీ వర్గీకరణ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

# సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

### ఉద్యమానికి...వర్గీకరణకు మా పూర్తి మద్దతు
### ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ చిత్తశుద్ధితో కృషి
### పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ వెల్లడి



హైదరాబాద్,ఆగస్ట్1 ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బీఆర్ఎస్ స్వాగతిస్తోందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు చేసిన పోరాట విజయమిదని చెప్పారు. మొదటి నుంచి ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ చిత్తశుద్ధితో కృషి చేసిందని తెలిపారు. ఈ అంశంపై మిగతా రాజకీయ పార్టీలన్ని ఓట్ల రాజకీయం చేశాయని కేటీఆర్ గుర్తు చేశారు. ఒకే పార్టీలో వర్గీకరణకు మద్దతుగా ఒక వర్గం.. వ్యతిరేకంగా ఓ వర్గం వాదనలు వినిపిస్తూ ఎస్సీలను మోసం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మాత్రమే ఎస్సీ వర్గీకరణలో మిగతా పార్టీల మాదిరిగా ఒకే పార్టీలో మేము రెండు వాదనలు వినిపించలేదన్నారు. ఒక్క కేసీఆర్ గారు మాత్రమే ఈ అంశాన్ని రాజకీయకోణంలో కాకుండా సామాజిక న్యాయ కోణంలో ఆలోచించారన్నారు. తెలంగాణ డిమాండ్ ఎంత న్యాయమైనదో.. ఎస్సీ వర్గీకరణ కూడా అంతే న్యాయమైన డిమాండ్ అని కేసీఆర్ గారు భావించారని చెప్పారు. అందుకే రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై తీర్మానం చేసిన సంగతిని గుర్తు చేశారు. స్వయంగా సీఎం హోదా లో కేసీఆర్ గారు ఢిల్లీ వెళ్లి ప్రధాని మోడీకి ఎస్సీ వర్గీకరణ చేయాలంటూ లేఖ ఇచ్చారన్నారు. ఎస్సీ వర్గీకరణ నా బాధ్యత అని కూడా కేసీఆర్ గారు చెప్పిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. అంతేకాకుండా ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రాష్ట్రాలకే అధికారం ఇవ్వాలని కూడా కేసీఆర్ గారు గతంలో కోరారన్నారు. ఇప్పుడు గౌరవ సుప్రీంకోర్టు కూడా ఇదే అంశాన్ని స్పష్టం చేసిందని చెప్పారు. ఎస్సీ లకు సంబంధించిన ఉప కులాల జనాభా ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉంటుంది. దానికి అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పించటం శుభపరిణామన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వర్గీకరణ ప్రక్రియ ను ప్రారంభించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ తరపున ప్రభుత్వానికి మా సహకారం ఉంటుందన్నారు.

# తెలంగాణలో రెండురోజులు భారీ వానలు..

### ఎల్లో అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ..!

హైదరాబాద్, తెలంగాణలో మరో రెండురోజుల పాటు భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. రాగల మూడురోజులు స్థిరమైన ఉపరితల గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో పలు జిల్లాల్లో వీస్తాయని పేర్కొంది. అలాగే, గురువారం నుంచి శుక్రవారం వరకు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, మహబూబాబాద్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని పేర్కొంది. శుక్రవారం నుంచి శనివారం ఉదయం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హన్మకొండ, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.



ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో నిజామాబాద్, జగిత్యాల్య, ఆదిలాబాద్, వనపర్తి, సిరిసిల్ల, సూర్యాపేట, ములుగుతో పాటు పలు జిల్లాల్లో మోస్తరు వర్షాపాతం నమోదైందని టీజీ ఎస్ వివరించింది.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్ట్

### ధర్నా వీడియోలపై స్పీకర్ సీరియస్



హైదరాబాద్, ఆగస్టు 1 తెలంగాణ అసెంబ్లీలో స్పీకర్ చాంబర్ ముందు ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ బయటకు తీసుకు వచ్చారు. వారిని తర్వాత పోలీసులు అరెస్టు చేసి బస్సులో స్టేషన్‌కు తరలించారు. రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాల్సిందేనని ఎమ్మెల్యేలు పట్టుబట్టారు. నిబంధనలకు విరుద్దంగా వ్యవహరించడం సరి కాదని.. స్పీకర్ చాంబర్ ముందు నుంచి అందరూ వెళ్లిపోవాలని చెప్పినా కదలకపోవడంతో.. మార్షల్స్ వారిని ఎత్తుకుని తీసుకెళ్లారు. అక్కడ వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తలించారు. తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ధర్నా వ్యవహారం వివా?స్పదమయింది. అసెంబ్లీ ప్రారంభమైన తర్వాత ఎమ్మెల్యేలు మహిళా ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తర్వాత అసెంబ్లీలోని సీఎం చాంబర్ ముందు ఎమ్మెల్యేలు ధర్నా చేశారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలోకి వచ్చాయి. నిజానికి అసెంబ్లీ ప్రాంగణం మొత్తంలో ఫోటోలు, వీడియోలు తీయాలన్నా.. తీసిన వాటిని బయటకు పంపాలన్నా.. ప్రసారం చేయాల్నా స్పీకర్ అనుమతి ఉండాల్సిందే. కానీ ఉద్దేశపూర్వకం?గ వీడియోలు తీసి ధర్నా చేసినట్లుగా మీడియాకు లీక్ చేయడంపై స్పీకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు రహస్యంగా రికార్డు చేసినట్లుగా అనుమానిస్తున్నారు. రికార్డు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించడంతో అసెంబ్లీ సిబ్బంది సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించి ఫోన్ రికార్డు చేసన వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి.. బుధవారం మీడియా ప్రతిని ధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. కొంత మందిపై సమయం సంద`ర్భాన్ని బట్టి అనర్హతా వేటు వేసేం దుకు అవకాశం ఉందని చెప్పారు. ఇలాంటి తప్పుల వల్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇరుక్కుపోతారని ఇప్పుడు..టార్గెట్ గా పెట్టుకున్న ఎమ్మెల్యేలే ఈ వీడియోలు రికార్డు చేశారని రికార్డు చేసుకుని చర్యలు తీసుకునే అవకాశాలు కూడా ఉంటాయి. బుధవారం అసెంబ్లలో జరిగిన పరిణామాలతో బీఆర్ఎస్ .. సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలన్న సింగిల్ పాయింట్ ఎజెండాగా రాజకీయం ప్రారంభించారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మల దహనానికి పిలుపునిచ్చారు. ప్రతీ రోజూ సాఫీగా సాగే అసెంబ్లీలో ఇవాళ స్కిల్ యూనివర్శిటీపై చర్చ జరగాల్సి ఉన్నా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆసక్తి చూపించలేదు. వారు రేవండ్ రెడ్డి క్షమాపణలు చెప్పాలన్న డిమాండ్ కే కట్టుబడ్డారు. తర్వాత సీఎం చాంబర్ ముందు ధర్నా చేసి.. వీడియోలు తీసుకున్నారు. దీంతో మార్షల్స్ వారిని అక్కడ్నుంచి బలవంతంగా తరలించారు.

# సంపాదకీయం

శుక్రవారం 02-08-2024

## ఎస్సీ వర్గీకరణ పోరాటానికి విజయం !

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా..అణగారిన వర్గాలకు న్యాయం జరగడం లేదు. రిజర్వేషన్ల ఫలాలు కొందరికే దక్కుతున్నాయి. కొందరే వీటి ద్వారా లబ్ది పొందుతున్నారు. వారే ఎస్సీ,ఎస్సీ నేతలుగా చలామణి అవుతున్నారు. ఆర్థికంగా బలపడిన వారు సైతం ఇంకా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పొందుతున్నారు. ప్రధానంగా ఎస్టీ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాలుగా పోరాటాలు సాగిస్తున్నారు. మందకృష్ణ మాదిగా ఆధ్వర్యంలో అలుపెరగని పోరాటం జరిగినా.. న్యాయం జరగలేదు. ఈ ఉద్యమంలో ఎందరో అసువులు బాసారు. ఎట్టకేలకు సుప్రీం ధర్మాసనం ఈ సమస్యకు న్యాయమైన తీర్పు ఇచ్చింది. ఈ క్రమంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆయా రాష్ట్రాలు ఉపకులాలకు అనుగుణంగా రిజర్వేషన్ల ప్రక్రియను అంటే..వర్గీకరణను నిర్వచించుకునే అవకాశం, స్వేచ్ఛను ఇచ్చింది. విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేసే అధికారం.. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టీకరించింది. సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పును వెల్లడించింది. గురువారం నాడు వర్గీకరణపై సుదీర్ఘ విచారణ జరిపిన ఏడుగురు సభ్యుల ధర్మాసనం.. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ సమర్థనీయమని స్పష్టం చేసింది. కాగా.. ఈ వర్గీకరణ ను మెజారిటీ సభ్యులు సమర్థించగా.. జస్టిస్ బేలా త్రివేది మాత్రం వ్యతిరేకించారు. అయితే ఈ తీర్పుతో ప్రభుత్వాలు మేల్కొనాలి. ఇంతకాలం అన్ని వర్గాలకు న్యాయం జరరగడం లేదని తీర్పుతో గుర్తించాలి. నిజానికి దేశంలో రిజర్వేషన్లు కొన్ని కుటుంబాలకే పరిమితం అయ్యాయి. ఈ అంశాన్ని పార్లమెంటులో ప్రధానంగా చర్చించాలి. ఓ రకంగా చెప్పాలంటే.. స్వాతంత్ర్యానంతరం బడుగు, బలహీనవర్గాలను, నిమ్నజాతులను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో తీసుకుని వచ్చిన రిజర్వేషన్లు పాక్షిక విజయం మాత్రమే సాధించాయి. దళితులు ఆదివాసీలు ఇంకా సమాజంలో దూరంగానే ఉండే పరిస్థితులు ఉన్నాయి. వారిని సమాజంలో భాగం చేసే కార్యక్రమాల అమల్లో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడమే దీనికి కారణం. రిజర్వేషన్ల లక్ష్యం నెరవేర లేదనడానికి ఆర్థికంగా వెనకబడిన అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం రావడమే. దేశంలో ప్రతి ఒక్కరూ సగర్వంగా బతకగలిగేలా దేశాన్ని ముందుకు తీసుకుని పోవడంలో ప్రభుత్వాలు విఫలం అవుతూ వచ్చాయి. రిజర్వేషన్లు పొందుతున్న కుటుంబాలు అదేపనిగా లబ్ధిపొందుతున్నాయి. రిజర్వేషన్లు అందని వారు అలాగే వెనకబాటులో ఉన్నారు. నిజానికి చట్టసభలనే తీసుకుంటే రిజర్వేషన్లను పొందుతున్న వారు జీవితాంతం వాటి ద్వారా లబ్ధిపొందుతున్నారు. వారే సర్పంచ్ నుంచి ఎంపిల వరకు ఎన్నికవుతున్నారు. కొన్ని కుటుంబాల వారికే రిజర్వేషన్ పదవులు దక్కుతున్నాయి. దీనిపై ఎక్కడా చర్చ జరగడం లేదు. దీనిపై సమీక్ష జరగడం లేదు. ఒకే కుటుంబం జీవితాంతం రిజర్వేషన్ల లబ్ది పొందుతూ పోతే కోట్లాదిమంది ఉన్న ఈ దేశంలో అందరికీ రిజర్వేషన్ల ఫలాలు ఎలా అందుతాయో పాలకులు గమనించడం లేదు. దేశంలో గౌరవంగా బతకడానికి అవకాశాలు కల్పించకపోవడం వల్ల రిజర్వేషన్లతో పైపూత పూసే యత్నం చేస్తున్నారు. ఈ దశలో రిజర్వేషన్లపై సమగ్ర చర్చ జరగాలి. ఎస్సీ ,ఎస్టీల్లో రిజర్వేషన్లు అందరికీ న్యాయంగా దక్కాలి. ముఖ్యంగా చట్టసభల్లో రిజ్వేషన్లు కొన్ని కుటుంబాలే ఎగురేసుకు పోతున్నాయి. ఇందులో అందరికీ న్యాయం దక్కాలి. దేశంలోని ఎస్సీ,ఎస్టీలు అందరికీ ఈ ఫలాలు దక్కాలనే అవసరాన్ని గుర్తించి అమలు చేసేలా సమగ్ర విధానం రావాలి. కొన్నికుటుంబాలే రాజకీయలబ్ది పొందే యత్నాలను అడ్డుకునేలా చేయాలి. నిజానికి మన విధానాలు లోపభూయిష్టంగా ఉన్నాయి. అవి సక్రమంగా అమలయివుంటే రిజర్వేషన్లప చర్చ చేసే అవసరం రాదు. కుల, మతాలతో నిమిత్తం లేకుండా ప్రతి పేదవ్యక్తీ హుందాగా జీవించేలా చూడటమే ప్రభుత్వాల లక్ష్యం కావాలి. అయితే ఇప్పుడున్న ఎస్సీ,ఎస్టీలు అందరితో సమానంగా ఎదగాలంటే రిజర్వేషన్లు సమానంగా అందించడం మినహా ప్రభుత్వం ముందు మరో మార్గం లేదనే చెప్పాలి. ఎస్సీ వర్గీకరణపై విపక్షాలు కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినా చివరకు ఒప్పుకోక తప్పలేదు. రాజకీయంగా కీలకమైన అంశానికి పార్టీలకు అతీతంగా మద్దతు లభించింది. విపక్షాలు తొలుత అనుమానాలు వ్యక్తం చేసినా, ఎక్కడ తాము ఆ వర్గాలకు వ్యతిరేకం కావలసి వస్తుందేమో అన్న భయంతో అన్ని పక్షాలు మద్దతు ఇస్తూ, వర్గీకరణకు తాము వ్యతిరేకం కాదని చెప్పాయి. మొత్తంగా ఇప్పుడు ఈ రిజర్వేషన్ల వర్గీకరణ అన్నది అత్యతంత వెనకబడిన మాది, మాదిగ ఉపకులాలకు ఎంతో మేలు చేకూరుస్తుంది. ఇదే సందర్భంగా మొత్తం ప్రక్రియపై చర్చించాలి. రాజకీయంగా ఏళ్లుగా రిజర్వేషన్ లబ్ది పొందుతున్న కొన్ని కుటుంబాలు నిరంతరంగా లబ్ది పొందకుండా చూడాలి. మిగతా కుటుంబాలకు కూడా ప్రయోజనాలు చేకూరాలన్న సంకల్పాన్ని ప్రకటించాలి. ఈ కులాల్లోని అన్నివర్గాల ప్రజలకు దీనివల్ల లబ్ది చేకూరిందా లేదా అన్నది చూడాలి. రిజర్వేషన్లను కేవలం అవసరమైన వారికే కల్పించేలా చూడాలి. ఇప్పటికే లబ్దిపొందిన కుటుంబాలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టేలా చట్టం చేయాలి. అప్పుడే రిజర్వేషన్ ఫలాలు అందరికి అందుతాయి. సుప్రీం తీర్పును స్వాగతిస్తూ అవసరమైతే పార్లమెంట్ చర్చించాలి. చట్టసభల్లో రిజర్వేషన్లు కొందరికే పరిమితం కాకుండా చూడాలి. అందరికీ రాజకీయంగా లబ్ది పొందేలా చూడాలి. అప్పుడే రిజర్వేషన్ల ఫలితం అందరికీ దక్కుతుంది.

# నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలి

### కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంత
### నర్సరీ, జెడ్పి హైస్కూల్, పీ.హెచ్.సీల పరిశీలన

నిజామాబాద్, ఆగస్టు 01 (లోకంతీరు): వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. మోస్రా మండలంలోని గోవూర్ గ్రామంలో గల నర్సరీని కలెక్టర్ గురువారం పరిశీలించారు. అదేవిధంగా స్థానికంగా గల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, మోస్రాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో జెడ్పి హైస్కూల్ లో చేపట్టిన పనులను పరిశీలించి, ఆయా తరగతుల విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, డిజిటల్ తరగతుల నిర్వహణ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యానికి అనుగుణంగా తెలుగు, ఆంగ్ల మాధ్యమాలలో నాణ్యమైన బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు సులభంగా ఆకళింపు చేసుకునే విధంగా, వారికి అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని హితవు పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ 7, 8, 9 తరగతులకు వెళ్లి, విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. ఆయా సబ్జెక్టుల వారీగా వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తిస్తూ, అలాంటి వారి పట్ల ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. పాఠశాలలో ఇప్పటికే పూర్తయిన పనులకు ఎం.బీ రికార్డు చేసి నివేదికలు పంపాలని, తుది దశలో ఉన్న పనులను వేగంగా పూర్తి చేయించాలని ఆదేశించారు. గోవూర్ లోని నర్సరీని క్షేత్రస్థాయిలో సందర్శించిన సందర్భంగా వివిధ రకాల మొక్కల పెంపకం తీరును పరిశీలించారు. విత్తనాలు ఎక్కడి నుంచి సేకరించారు, మొలకెత్తిన మొక్కల శాతం ఎంత, ఇప్పటివరకు ఎన్ని మొక్కలు పంపిణీ చేశారు, ఎన్ని మొక్కలు నాటారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.



నర్సరీని ఆనుకుని ఉన్న అటవీ భూమి ఎకరం విస్తీర్ణంలో జామ, సీతాఫల్, బొప్పాయి వంటి పండ్ల మొక్కలను నాటి కోతులు, ఇతర అటవీ జంతువుల కోసం ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయడాన్ని గమనించిన కలెక్టర్ స్థానిక అధికారులను అభినందించారు. ఇదే తరహాలో మండలంలోని ఇతర గ్రామ పంచాయతీల పరిధిలో కూడా అవకాశం ఉన్న చోట విరివిగా మొక్కలు నాటి ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. వనమహోత్సవం లక్ష్యాలకు అనుగుణంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని అన్నారు. నర్సరీలలో మొలకెత్తని విత్తనాల స్థానంలో ఇతర మొక్కలు పెంచాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అంకితభావంతో కృషి చేయాలని అన్నారు. అనంతరం మోస్రా పీ.హెచ్.సీని సందర్శించిన కలెక్టర్, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. స్థానికంగా నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, రోగులకు అందిస్తున్న చికిత్సల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని రిజిస్టర్లను తనిఖీ చేసిన కలెక్టర్, స్థానికంగా అందుబాటులో ఉ





ంటూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డాక్టర్లకు, సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి రమేష్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, పంచాయతీరాజ్ ఈ.ఈ శంకర్ నాయక్ తదితరులు ఉన్నారు.

# సెంటిమంటలో ఆ ముగ్గురు ఎమ్మెల్యేలు

## వాస్తు భయంతో దూరం... దూరం

నిజామాబాద్, ఆగష్టు 1, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల్లో ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీరు చర్చనీయాంశమవుతోంది. ఎమ్మెల్యేలుగా గెలిచి సుమారు 8 నెలలు కావస్తున్నా.. ఆ ముగ్గురు తమ కార్యాలయాల్లోకి అడుగుపెట్టకపోవడమే పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. సొంత నియోజకవర్గాల్లో ఉంటున్న ఎమ్మెల్యేలు? ప్రభుత్వం లక్షల రూపాయలతో నిర్మించిన కార్యాలయాలకు రాకపోవడమేంటని? ఆరా తీస్తే ఆశ్చర్యకరమైన విషయాలు బయటపడ్డాయి. ఎన్నికల్లో వీరోచితంగా పోరాడిన సదరు నేతలు? వాస్తు భయంతోనే తమ కార్యాలయాల్లోకి అడుగుపెట్టలేదట.. ఇలా వాస్తు అంటే భయపడిపోతున్న ఆ ముగ్గురూ కాంగ్రెస్ వారే? సీనియర్ నేత బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితోపాటు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌లకు వాస్త భయం పట్టుకుందనే సమాచారం హాట్‌టాపిక్‌గా మారింది.ప్రజలకు ఎమ్మెల్యేలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో గత సర్కార్‌లో నియోజకవర్గ కేంద్రాల్లో క్యాంపు కార్యాలయాలను నిర్మించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక హంగులతో భవనాలు నిర్మించగా, చాలా మంది ఆయా కార్యాలయాల నుంచి సేవలు అందిస్తున్నారు. ఐతే కొందరు మాత్రం వాస్తు భయంతో అటువైపు కూడా చూడటం లేదు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, మదన్‌మోహన్ సైతం ఇదే భయంతో క్యాంపు కార్యాలయాలకు వెళ్లడం లేదని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుత భవనాల్లో పనిచేసిన బీఆర్ఎస్ నేతలు తమ చేతిలో ఓడిపోడానికి? క్యాంపు కార్యాలయాల్లో వాస్తు దోషాలే కారణమని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భావిస్తున్నారట గత ఏడాది వరకు కళకళలాడిన క్యాంపు కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. ఎనిమిది నెలలుగా ఎమ్మెల్యేలతోపాటు ఏ ఒక్కరూ అటువైపు రాకపోవడంతో భవనాలు నిరూపయోగంగా మారిపోయాయి. ఇక క్యాంపు కార్యాలయాలను వినియోగించని ఎమ్మెల్యేలు ప్రత్యామ్నాయంగా సొంతంగా కార్యాలయాలు ప్రారంభించడం చర్చనీయాంశంగా మారింది. ఐతే ఆధునిక కాలంలో బాగా చదువుకున్న వారు? రాజకీయ వ్యూహాల్లో ఆరితేరిన నేతలు వాస్తు అంటూ ఖరీదైన.. ఆధునిక వసతులతో కూడిన భవనాలను వృధాగా వదిలేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయిఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ బాగా చదువుకున్న వారు. విదేశాల్లో వ్యాపారం చేసి వచ్చిన వారు. అలాంటి ఆయన సెంటిమెంట్‌కు ప్రాధాన్యం ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా మంచి మెజార్టీతో గెలిచిన మదన్‌మోహన్‌కు వాస్తు భయం ఉందనే ప్రచారంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యేగా గెలిచిన 8 నెలల్లో ఒక్కసారి కూడా తన క్యాంప్ కార్యాలయంలో అడుగు పెట్టలేదు మదన్‌మోహన్. దీంతో క్యాంప్ కార్యాలయాన్ని ఈ మధ్యనే విద్యుత్ శాఖ డీఈ ఆఫీస్‌కు మార్చారని చెబుతున్నారు.ఇక బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తీరు కూడా చర్చనీయాంశమవుతోంది. ఉమ్మడి జిల్లాలోనే సీనియర్ కాంగ్రెస్ నేతగా సుదర్శన్‌రెడ్డికి మంచి గుర్తింపు ఉంది. పదేళ్ల క్రితం వరకు జిల్లాలో చక్రం తిప్పిన సుదర్శన్‌రెడ్డి మంత్రిగానూ పనిచేశారు. అలాంటి నేత కూడా ఇప్పుడు వాస్తు పేరిట కార్యాలయానికి దూరంగా ఉంటుండటమే చర్చకు తావిస్తోంది. ప్రస్తుతం జిల్లా నుంచి మంత్రివర్గం రేసులో ఉన్న సుదర్శన్‌రెడ్డి?. ఎమ్మెల్యేల కోసం లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలను వృథాగా వదిలేయడంపై విమర్శలు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సైతం క్యాంపు కార్యాలయం వైపు కన్నెత్తి చూడటం లేదంటున్నారు.మొత్తానికి ముగ్గురు ఎమ్మెల్యేల తీరుపైన పొలిటికల్ సర్కిల్స్‌గా పెద్ద చర్చే జరుగుతోంది. ఎవరి సెంటిమెంట్ వారికి ఉంటుంది? క్యాంపు కార్యాలయాలకు రాకపోయినా, ప్రజలకు అందుబాటులోనే ఉంటున్నారు కదా? అంటూ కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యేలను వెనకేసుకొస్తుంటే? బీఆర్ఎస్ మాత్రం విలువైన భవనాలను గాలికొదిలేయడంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది.

# రుణమాఫీలో మిస్సింగ్ లిస్ట్....

కరీంనగర్, ఆగస్టు 1 పంట రుణాల మాఫీతో రైతన్నలో సంబురాలతో పాటు కొందరిలో ఆందోళన నెలకొంది. లక్ష, లక్షన్నర రుణం ఉన్నా మాఫీ జాబితాలో పేర్లు లేక పోవడంతో రైతన్నను కలవరపెడుతోంది. ఫస్ట్, సెకండ్ జాబితాలో లక్షన్నర వరకు క్రాప్ లోన్ ఉన్నా మాఫీ కాకపోవడం అన్నదాతలు ఆవేదనతో ఆందోళన చెందుతున్నారు. అధికారుల చుట్టూ తిరిగే దుస్థితి ఏర్పడింది. చిన్న చిన్న సమస్యలను షాకు గా చూపి చాలామంది రైతులను రుణం మాఫీకి దూరం చేస్తుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.రెండు విడతల్లో రాష్ట్ర వ్యాప్తంగా 17 లక్షల 75 వేల మంది రైతులకు సంబంధించి 12 వేల 225 కోట్లు ప్రభుత్వం పంట రుణాలను మాఫీ చేసింది. తొలి విడత ఈనెల 18న లక్ష రూపాయల వరకు 11 లక్షల 34 వేలమంది రైతులకు 6035 కోట్లు మాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు వారాల వ్యవధిలోనే రెండో విడత లక్షన్నర లోపు లోన్ ఉన్న 6 లక్షల 41 వేల మంది రైతులకు సంబంధించి 6190 కోట్లు మాఫీ చేసి మూడో విడత రెండు లక్షల వరకు రుణాలను మాఫీ చేసే పనిలో నిమగ్నమయ్యింది.రైతుల రుణ మాఫీ కావడం సర్వత్ర హర్షం వ్యక్తం అవుతున్నా రెండు విడతల్లో లక్ష 50 వేల లోపు లోన్ ఉన్న వారి చాలామంది రైతుల పేర్లు మాఫీ జాబితాలో లేకపోవడం ఆందోళనకు గురిచేస్తుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండు విడతల్లో లక్ష 94 వేల మంది రైతులు రుణ మాఫీ తో రుణవిముక్తులు కాగా ఇంకా చాలామంది రైతులు అనర్హులుగానే మిగిలారు. ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో రుణమాఫీకి నోచుకోని రైతులు ఉండడం సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతుంది.రెండు విడతలుగా లక్షా 50 వేల వరకు పంట రుణాలు ఉన్న రైతుల లోన్ మాఫీ చేసిన ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో పేర్లు లేని రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. రుణ మాఫీ ఎందుకు కాలేదో ఆరా తీస్తున్నారు. రేషన్ కార్డు లేని రైతుల పేర్లు రుణమాఫీ జాబితాలో లేవు. రేషన్ కార్డు ప్రమాణికం కాదని ప్రభుత్వం చెబుతున్నా... ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉందని స్పష్టం అవుతుంది.రేషన్ కార్డు కేవలం కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసమే రేషన్ కార్డును పరిగణలోకి తీసుకుంటామని ప్రభుత్వం చెప్పినప్పటికీ రేషన్ కార్డు లేని రైతుల పేర్లు రుణమాఫీ జాబితాలో లేకపోవడం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తుంది. రేషన్ కార్డు తో పాటు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ఇప్పటివరకు అందుకోని రైతుల పేర్లు సైతం రుణమాఫీ జాబితాలో చోటు లభించలేదు.క్రాప్ లోన్ ఉన్న రైతు బ్యాంక్ ఖాతా పేరుకు ఆధార్ కార్డులో ఉన్న పేరుకు మ్యాచ్ కాని రైతులు సైతం రుణమాఫీ నోచుకోని పరిస్థితి కనిపిస్తుంది. రెండు విడతల్లో ఒక్క ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే సుమారు లక్ష మందికి రుణమాఫీని నోచుకోలేదనే ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి. రెండు జాబితాలో పేర్లు రాని రైతులు వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ అధికార పార్టీ నేతల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.రేషన్ కార్డు ప్రమాణికమైతే తాము ఎప్పుడో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నామని రేషన్ కార్డులు ఇవ్వకుండా ఇప్పుడు రేషన్ కార్డుతో రుణమాఫీ లింక్ పెట్టి ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసమని రైతన్నలు ప్రశ్నిస్తున్నారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వడంలో మీనమేషాలు లెక్కిస్తున్న ప్రభుత్వం రేషన్ కార్డు లేని రైతులకు సైతం రుణమాఫీ వర్తింపజేయాలని రైతు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల వరకు పంట రుణం ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని కోరుతున్నారు. రుణమాఫీ నుంచి తప్పించుకోవాలని ప్రభుత్వం పొంతనలేని నిబంధనలు పెట్టి రైతులను ఇబ్బంది పెడితే ఆందోళన చేయక తప్పదని రైతు సంఘాల ప్రతినిధులు, బిఆర్ఎస్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు హెచ్చరిస్తున్నారు.రెండవ విడత రైతు రుణమాఫీ నిధుల విడుదల పెద్దపల్లి కలెక్టరేట్ రుణమాఫీ లబ్దిదారులతో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ రెండు విడతల్లో పెద్దపల్లి జిల్లాలో 42 వేల 965 మంది రైతులకు 271 కోట్ల రుణమాఫీ అయిందని తెలిపారు. చాలా మంది రైతుల పేర్లు రుణమాఫీ జాబితాలో లేవని ఫిర్యాదులు అందుతున్నాయని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో ఫిర్యాదుల నమోదు కోసం ప్రత్యేకంగా కలెక్టరేట్ లో టోల్ ఫ్రీ నెంబర్ సైతం ఏర్పాటు చేశామని, రుణమాఫీ పథకంపై రైతులు తమ సందేహాలను 18005995459 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా నమోదు చేయాలని కలెక్టర్ కోరారు.

# పూజాకు షాక్...

ముంబై, ఆగస్టు1, పుణేలో ట్రైయినీ కలెక్టర్‌గా ఉద్యోగం చేస్తూ వివాదంలో ఇరుక్కున్న పూజా ఖేద్కర్‌కు కోలుకోలేని దెబ్బ తగిలింది. పూజా ఖేద్కర్ సివిల్స్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేస్తూ జఖూఅ బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా భవిష్యత్‌లో కూడా పరీక్షలు రాయకుండా ఆమెపై నిషేధం విధించింది. తప్పుడు డాక్యుమెంట్లతో పూజా ఖేద్కర్ ఉద్యోగం పొందినట్టు దర్యాప్తులో తేలింది. నిబంధనలను ఉల్లంఘించడంతో పూజా ఖేద్కర్‌పై చర్యలు తీసుకున్నారు. పూణేలో పోస్టింగ్ రాగానే ఆమె పలు సౌకర్యాలు కోసం డిమాండ్ చేయడంతో వివాదం రాజుకుంది. మెల్లమెల్లగా ఆమెకు సంబంధించి పలు అక్రమాలు వెలుగు లోకి వచ్చాయి. తప్పుడు ఓబీసీ సర్టిఫికేట్‌తో పాటు దృష్టి లోపాలకు సంబంధించి తప్పుడు సర్టిఫికేట్లు సమర్పించి ఇంటర్వ్యూకు హాజరైనట్టు గుర్తించారు. అంతేకాకుండా పూజా ఖేద్కర్ తల్లి మనోరమ రైతులను గన్‌తో బెదిరించిన వ్యవహారంపై కూడా రచ్చ జరిగింది. ఈ కేసులో మనోరమను పోలీసులు అరెస్ట్ చేశారు.ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ సీఎస్ఈ 2022 నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినట్లు తేలడంతో దోషిగా కమిషన్ నిర్ణయించింది. యూపీఎస్సీ పరీక్షల్లో తన పేరును మాత్రమేకాకుండా, తన తల్లిదండ్రుల పేర్లు కూడా మార్చుకున్నట్లు గుర్తించారు. అలాగే యూపీఎస్సీ అటెంప్ట్ విషయంలోనూ ఆమె నిబంధనలను తుంగలో తొక్కినట్లు గుర్తించారు. ఈ క్రమంలో 2009 నుంచి 2023 వరకు మొత్తం 15 సంవత్సరాల ప్రయత్నాల సంఖ్యకు సంబంధించి 15 వందలకు పైగా అభ్యర్థుల డేటాను యూపీఎస్సీ పరిశీలించింది. ఈ డేటాలో పూజ మనోరమ దిలీప్ ఖేద్కర్ మినహా ఎవ్వరూ అనుమతించిన దానికంటే అదనంగా ఎవరూ ఎక్కువ ప్రయత్నాలలో పరీక్ష రాసినట్లు గుర్తించలేదు.పూజా ఖేడేకర్ (34) తన ప్రైవేట్ ఆడి కారులో బీకాన్‌ను అనధికారికంగా ఉపయోగించడంతో పాటు, ప్రత్యేక కార్యాలయం, అధికారిక కారును డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో మీడియా ఫోకస్ ఆమెపైకి మళ్లింది. మొదట్లో పూణేలో ఉన్న ఖేద్కర్‌ను వివాదాల నేపథ్యంలో ఆమెను పూణే జిల్లా కలెక్టర్ వాషిమ్‌కు బదిలీ చేశారు. అయినా ఆమెను చుట్టుముట్టిన వివాదాలు వీడలేదు. ముస్సోరీలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడెమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ కి ఆమెను తిరిగి పిలిపించి, ఆమె 'జిల్లా శిక్షణా కార్యక్రమాన్ని' తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ఆమె సమర్పించిన వైకల్యం, ఞఃఅ సర్టిఫికెట్ల ప్రామాణికత కోసం విచారణ జరపగా.. అవన్నీ నకిలీ ధ్రువీకరణ పత్రాలుగా దర్యాప్తులో తేలింది. దీంతో యూపీఎస్సీ ఆమె సివిల్స్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయడంతోపాటు, భవిష్యత్తులో ఏ పరీక్షలు రాయకుండా శాశ్వతంగా డీబార్ చేస్తున్నట్లు ప్రకటించింది.

# హెచ్ సీఏలో అంతులేని అవినీతి

హైదరాబాద్, ఆగస్టు 1 దేశానికి గతంలో అద్భుతమైన క్రికెటర్లను అందించిన హైదరాబాద్..ఇప్పుడు అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారిపోయింది. పరుగులు చేయకపోయినా ఫర్వాలేదు..వికెట్లు తీయకపోయినా నష్టం లేదు, లాబీతో పరిచయాలుండి వాళ్లు అడిగినంత డబ్బిస్తే చాలు ఏ టోర్నీలోనైనా ఆడేయవచ్చు. ప్రతి దానికీ ఓ రేటు ఫిక్స్‌చేసి అమ్మేసుకుంటున్నారనే టాక్ రీసౌండ్ వస్తోంది. ఎవరు ఎక్కువ డబ్బులు ముట్టచెబితే వాళ్లకే అవకాశాలు దక్కుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు ఇదే వ్యవహారంపై దృష్టి సారించిన ఏసీబీ అధికారులు..అవినీతి తీగ లాగే పని ప్రారంభించారు. 2022లో నమోదైన కేసుపై.. ఊఅం కార్యాలయంలో తాజాగా సోదాలు నిర్వహించారు.2022లో తన క్లబ్ నుండి ఆడించేందుకు ప్లేయర్ నుండి డబ్బులు డిమాండ్ చేశారు..కాంటినెంటల్ క్రికెట్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభి శ్రీనివాస్. అండర్-19 లో ఆడించేందుకు ఓ ప్లేయర్ తండ్రి నుండి..9 లక్షలు లంచం తీసుకున్నారు. అయితే ఇంత మొత్తంలో డబ్బు చెల్లించినా కూడా..తన కుమారుడిని తుది జట్టులో ఆడించకపోవడంతో బాధితుడు తండ్రి..ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో అప్పట్లోనే కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు.. ఆరోపణలు ఎదుర్కొంటున్న పట్టాభి శ్రీనివాస్ నివాసంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో కీలక పత్రాలతో పాటు నగదు కూడా స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌సీఏలో నాటి పరిస్థితుల కారణంగా ఈ కేసు ముందుకు సాగలేదు. అయితే గత ఏడాది అధ్యక్ష పదవిలోకి వచ్చిన జగన్ మోహన్ రావ్ నేతృత్వంలో..ఆఫీస్ బ్యారర్స్ అంతా ఒకే మాటపై ఉన్నారు. దీంతో అవినీతి కేసుకు సంబంధించిన ఆధారాలు సేకరించే పనిలో పడ్డారు..ఏసీబీ అధికారులు. హెచ్‌సీఏ కార్యాలయానికి వెళ్లిన ఏసీబీ అధికారులకు..అవసరమైన సమాచారం అందించారు

# తాగుడుకు బానిసై ఆత్మహత్య...




బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 01 (లోకంతీరు)తాగుడుకు బానిసగా మారి ఆత్మహత్య చేసుకున్న సంఘటన భీంగల్ కేసీఆర్ కాలనీ లో జరిగింది. ఎస్సైహరిబాబు తెలిపిన వివరాల ప్రకారం కాలనీ కి చెందిన షేక్ అర్షద్ ( 36 )మద్యానికిబానిసగామారడు. పెయింటర్ గా పనిచేస్తున్న మృతు డినితాగుడ ుమాను కునికుట ుంబాన్నిపోషిం చాలని మంద లించారు. దాంతో ఈగ తనెల 31న రాత్రి ఉరివేసుకుని మృతి చెంది నట్టు ఎస్సై చెప్పారు. మృతుని కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రి కి పోస్ట్ మార్టం నిమిత్తం పంపించినట్టు ఎస్సై తెలిపారు.

# సుప్రీంకోర్టులో ఎస్సి ఎస్టీలకు వర్గీకరణకు ఊరట



కామారెడ్డి జిల్లా ఆగష్టు 01 లోకం తీరు సుప్రీంకోర్టులో ఎస్సి ఎస్టీల వర్గీకరణకు న్యాయంగా తీర్పు ఇవ్వడం జరిగిందని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎన్నో రోజులుగా దళితులు చేస్తున్న పోరాటం న్యాయమే అయిందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవతి రెడ్డి అసెంబ్లీలో మనస్ఫూర్తిగా స్వాగతించారు. వారికి మాదిగ, మాదిగ ఉపకులాల తరపున ఉద్యమ నమస్కారాలు తెలియజేస్తున్నామని ఎంఆర్పిఎస్కామారెడ్డిజిల్లా అధ్యక్షులు ఆర్ బాగయ్య తెలిపారు. అమరులైన దళిత బిడ్డలకు ఏబిసిడి వర్గీకరణ వారి ద్వారా వాళ్ల ఆత్మ శాంతి చేకుర్చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. దళిత అమరులకు జోహార్ జోహార్ అని మాదిగ రాజకీయ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆరు బాగయ్య మాదిగ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాదిగ రాజకీయ పోరాట సమితి తరపున ఉద్యమ వందనాలు తెలిపారు.

# వ్యాప్తి చెందుతున్న సీజనల్ వ్యాధులు



హైదరాబాద్, ఆగస్టు 1 తెలంగాణలో ఈ ఏడాది భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో సీజనల్ వ్యాధుల వ్యాప్తి పెరుగుతున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలపై డెంగ్యూ ప్రభావం ఉన్నట్లు సమాచారం. నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి, నిలోఫర్ లో డెంగ్యూ జ్వరాలతో వస్తున్న పిల్లల సంఖ్య పెరుగుతోంది. డెంగ్యూ ఫీవర్ పట్ల నిర్లక్ష్యం చేయొద్దని వైద్యులు సూచిస్తున్నారు. ఐదారు రోజులకు పరిస్థితి విషమిస్తుందని హెచ్చరిస్తున్నారు.నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ నివేదిక ప్రకారం తెలంగాణలో జులైలోనే 722 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరి నుంచి జులై వరకు మొత్తం 1800 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని నివేదిక పేర్కొంది. జనవరి నుంచి జూన్ వరకు 1,078 డెంగ్యూ కేసులు నమోదవ్వగా... జులై చివరి నాటికి ఈ సంఖ్య 1,800కి పెరిగింది. వీటిలో 60 శాతం కేసులు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నమోదయ్యాయి. మిగిలిన కేసులు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో రికార్డు అయ్యాయి. అయితే గత కొన్ని సంవత్సరాలుగా డెంగ్యూ కేసుల్లో తగ్గుదల కనిపిస్తుంది. 2019లో 13,331 కేసులు, ఏడు మరణాలు రికార్డు కాగా, 2020లో 2,173 కేసులు, 2021లో 7,135 కేసులు. 2022లో 8,972 కేసులు, మరియు 2023లో 8,016 కేసులు, ఒక మరణం నమోదయ్యాయని లెక్కలు చెబుతున్నాయి.తెలంగాణ వ్యాప్తంగా డెంగ్యూ కేసుల్లో జీహెచ్ఎంసీ పరిధిలోనే 60 శాతం కేసులు నమోదయ్యాయి. డెంగ్యూ బాధితుల నుంచి ప్లేట్లెట్ కోసం అభ్యర్థనలు పెరుగుతున్నాయని బ్లడ్ బ్యాంకుల నిర్వాహకులు తెలిపారు.అకస్మాత్తుగా హై ఫీవర్ రావడం, తీవ్రమైన తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, కంటి కదలికతో నొప్పి తీవ్రమవుతుండడం, కండరాలు, కీళ్ల నొప్పులు, రుచి, ఆకలి లేకపోవడం, ఛాతీ, శరీరంపై దద్దుర్లు, వికారం, వాంతులు, రక్తపు వాంతులు, ముక్కు, నోరు, చిగుళ్ల నుంచి రక్తస్రావం, నిద్రలేమి, దాహం అనిపించడం, నోరు ఎండిపోవడం, పల్స్ పడిపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిదోమల ద్వారా సంక్రమించే వ్యాధులను నియంత్రించేందుకు ముందు జాగ్రతలు తీసుకోవాలి. పొత్తికడుపు నొప్పి, వాంతులు, రక్తస్రావం వంటి తీవ్రమైన లక్షణాల ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఇంటి లోపలకు దోమలు రాకుండా దోమ తెరలను ఉపయోగించాలి. బయట ఉన్నప్పుడు పొడవాటి దుస్తులు ధరించండి. ఇంటి తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి.వర్షాలు పెరిగే అవకాశం ఉందని, డెంగ్యూ వ్యాప్తి చెందకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ సూచించింది. తలుపులు, కిటికీలకు దోమతెరలు అమర్చుకోవాలని, ఉదయం, సాయంత్రం దోమలు ఎక్కువగా ఉండే సమయాల్లో తలుపులు, కిటికీలు మూసి ఉంచాలని సూచించింది. సెప్టిక్ ట్యాంకులను కప్పి ఉండాలని, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులు తెలిపారు. ఇళ్ల చుట్టూ నిలిచిన నీటిని తొలగించడానికి వారానికోసారి "ఫ్రైడే డ్రై డే" పాటించాలని అధికారులు సూచించారు.

# ఆరోగ్య కేంద్రంను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





కామారెడ్డి జిల్లా ఆగష్టు 01 లోకంతీరునిజాంసాగర్ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం తనిఖీ చేశారు. ఆసుపత్రి నందు హాజరు పట్టిక ను చూసి తేదీ: 27-07-2024 నుండి నేటి వరకు విధులకు హాజరు కానీ జూనియర్ అసిస్టెంట్ సుభాష్ ను సస్పెండ్ చేశారు. రెగ్యులర్ గా విధులకు హాజరు కానీ ల్యాబ్ టెక్నీషియన్ నవ్యశ్రీ ని కలెక్టర్ ను సంజాయిషీ కోరారు. ఇన్ పేషెంట్ వార్డును పరిశీలించి రోగులతో మాట్లాడి ఆసుపత్రి లో అందుతున్న రోగుల సేవల పై సంతృప్తి వ్యక్తం చేశారు. అందుబాటులో ఉన్న మందుల వివరాల గూర్చి వైద్యాధికారి డా. రోహిత్ కుమార్ ను అడగడం తెలుసుకున్నారు. ఆసుపత్రిలో నాటిన హరిత హారం చెట్లను పరిశీలించారు. మెడికల్ వేస్ట్ ను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా గుంతలలో వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమములో బాన్సువాడ ఆర్డిఓ రమేష్ రాథోడ్, జిల్లా వైద్యాధికారి డా. చంద్ర శేఖర్, ఉప వైద్యాధికారి డా. విద్య, మండల అభివృద్ధి అధికారి, మండల తహసీల్దార్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# సారూ జర ఇదర్ దేకో...?

- ఆ గ్రామపంచాయతీలో వాటర్ మెన్ సూపర్ మేన్ తో సమానం..?
- గాడి తప్పుతున్న స్పెషల్ పాలన..?
- ఇకనైనా ఎన్నికలు నిర్వహిస్తారా..?
- అస్తవ్యస్తంగా మురికి కాలువలు...?
- బురదమయంగా మారిన కాలనీ రోడ్లు..!
- పట్టించుకోని అధికారులు...?
- గాడి తప్పిన పంచాయతీ పాలనా....?
- మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్త..?





ఉమ్మడి నిజామాబాద్ ఆగస్టు1(లోకంతీరు)ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు మండల కేంద్రాలలోని ఆయా గ్రామాలలో, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలలో మురికి కాలువలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. మురికి కాలువల్లో చెత్త చెదారం పేరుకుపోయి దోమలు వ్యాప్తి చెంది పలు రోగాల భారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ మురికి కాలువల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు.? పంచాయతీ పాలనా గాడి తప్పిందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.? ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి మురికి కాలువలను శుభ్రం చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు. ముఖ్యంగా అసలే వర్షాకాలం దోమలతో సతమతం అవుతున్న కాలనీవాసులు అదేవిధంగా పట్టింపు లేని పంచాయితీ సిబ్బంది. అధికారుల సమన్వయ లోకమే ఇందుకు కారణమా..? గ్రామ పంచాయతీలకు తెలంగాణ నిబంధనల ప్రకారం స్పెషల్ అధికారులను నియమించారు. వారి సమయపాలన దేవుడేరుగు, అదేవిధంగా కొన్ని గ్రామాలలో సైతం పారిశుద్ధ్య లోపం తాండవిస్తోంది. సిసి రోడ్లు లేని, కాలనీలలో సైతం బురదమయం, పట్టించుకునే వారు లేక బురదలోనే నడుస్తూ ఈగలు దోమలతో సతమతమవుతున్న కాలనీవాసులు ముఖ్యంగా ప్రభుత్వం సూచన అసలే వర్షాకాలం అందరూ జాగ్రత్తగా ఉండాలి. శుభ్రమైన నీరును తాగాలి. పరిసరాలలో పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మురికి మీరు నిల్వ ఉంచకూడదు, అదేవిధంగా మురికి కాలువలను శుభ్రంగా ఉంచాలి. అని పదే పదే చెబుతున్న వైనం. కానీ పట్టింపు లేని పంచాయతీలు, బ్లీచింగ్ పౌడర్లు చల్లి ఏలు గడుస్తున్నాయి, రోడ్ల పక్కన పిచ్చి మొక్కలను ట్రాక్టర్ల సహాయంతో తొలగిస్తూ, మురికి కాలువల పక్కన పిచ్చి మొక్కలపై గడ్డికి సంబంధించిన కల్ప మందులను పిచికారి చేయడం. ఇంతే కార్మికులు మాత్రం అసంతృప్తితో ప్రభుత్వం పై విడుచుకుపడుతున్నారు. జిపి కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తూ నిస్సహాయంగా పనులకు హాజరవుతూన్నారు. కానీ కొన్ని మేజర్ గ్రామపంచాయతీలలో ఈ కార్మికుల సమస్య సరిపోక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని మెజార్ గ్రామపంచాయతీరాలు కొన్ని వార్డులలో చిట్టడివిని తలపించేలా పెద్ద పెద్ద చెట్లు, కూలిపోయిన ఇండ్లు, పెద్ద పెద్ద చెట్లు, విద్యుత్తు లేని ఆ ప్రాంతం భయాందోళనగా, దర్శనమిస్తోంది. అంతేగాక ఇక వాటర్ మెయిన్ లు సూపర్ మేన్లుగా మారుతున్నారు. వారికి ఏదైనా వర్క్ చెప్పాలంటే ముందుగా మాకు చెప్పాల్సిన అవసరం లేదు, ఏదైనా చెప్పాలనుకుంటే సెక్రెటరీ చెప్పండి, లేదంటే కరోబార్ కు చెప్పుకోండి, ఇంకా నీ ఇష్టం ఉంటే గ్రామపంచాయతీ కంప్లీట్ చేసుకో అని అనడం విడ్డూరం. ఇంతకీ కారణం గ్రామ పాలకవర్గం లేకపోవడం ఏనా, ఇకనైనా ప్రభుత్వ స్పందించి స్థానిక ఎన్నికలను, గ్రామపంచాయతీ ఎన్నికలను త్వరగా నిర్వహించి ప్రజల సమస్యలను తీర్చవలసిందిగా మేధావి వర్గం భావిస్తోంది

# ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు చేయడంలో విఫలం



కామారెడ్డి జిల్లా ఆగష్టు 01 లోకంతీరుకామారెడ్డి జిల్లా బిబిపేట్ మండల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటిలో ఎక్కువ మొత్తం గ్యాస్, విద్యుత్ అని బీబీపేట మాజీ ఎంపిటిసి నీరజ నర్సింలు అన్నారు. బిబిపేట్ మండలం లో చాలామంది సర్వర్ రాలేదనుకుంటూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మాజీ ఎంపీటీసీ కొరివి నీరజ నర్సింలు, ఆగ్రహం వ్యక్తం చేసారు. బిబిపేట మండల కేంద్రంలోని పదివేల ఉన్న జనాభాలో కనీసం 60 శాతం మంది కూడా గ్యాస్ కానీ విద్యుత్ ఉచితంగా ఇస్తున్నామని ప్రభుత్వం ఆరు గ్యారంటీలో ఈ విద్యుత్ పథకం కూడా ప్రతి లబ్ధిదారికి ఇప్పటికే ఊసే లేదన్నారు. 200 లోపల ఉన్నా యూనిట్లు తెల్ల రేషన్ కార్డు ఉండి ప్రజా పాలనలో ఫిర్యాదు చేసి ఉన్న సభ్యులు కూడా 65% మందికి అయిన ఇంకా దరఖాస్తులను ఆన్లైన్లో పెట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని హామీలు ఇస్తున్నామని చెప్పుతున్నారు. ఇలా కొంతమందికి ఇచ్చి కొంత మందికి ప్రజా పాలన వచ్చిన తర్వాత దరఖాస్తు చేసుకోండని ఎంపీడీవో వివరించారు. కానీ ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన జారీ చేయలేదన్నారు. ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి విద్యుత్ బిల్లు కట్టవలసిన అవసరం లేదు. విద్యుత్ డిపార్ట్మెంట్ వాళ్లేమో కచ్చితంగా కట్టాలని ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి లబ్ది దారులకు ఉచిత విద్యుత్ పథకాన్ని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేయాలన్నారు. ఉన్నవారికి ఇప్పటికే ఎనిమిది నెలల ఉచితం గా అందుతుంది. విద్యుత్ బిల్లు నిజంగా మీరు మాట తప్పకుండా ప్రభుత్వం ఈ రెండిటి మీద వెంటనే వాళ్ళ తప్పులు ఏమైనా ఉంటే సరిదిద్దు కోవాలన్నారు. ప్రజా పాలన అర్హులకు అందరికీ న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం బిల్లులు కట్టకపోతే బలవంతంగా కట్టించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే మరోసారి ప్రజా పాలన పెట్టి దరఖాస్తుల స్వీకరించి అందరికీ విద్యుత్ బిల్లు ఉచితం అయ్యే విధంగా సహకరించాలని కోరారు. ఎవరైతే విద్యుత్ బిల్లు కట్టలేరు. ఇప్పటి వరకు వాళ్ళు విద్యుత్ బిల్లు కడతాను లేరు కాబట్టి మీరు వెంటనే తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి అప్పటినుంచి ఇప్పటివరకు జీరో బిల్లు లేని నిరుపేదలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# లింగన్నబావిని పరిశీలించిన జిల్లా కలెక్టర్...





కామారెడ్డి జిల్లా ఆగష్టు 01(లోకంతీరు):జిల్లాలోని లింగంపేట మండల కేంద్రంలో నాగన్న బావిని గురువారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఇన్ఫోసిస్ వైస్ ప్రెసిడెంట్ కల్పనా రమేష్ తో కలిసి గురువారం పరిశీలించారు. ప్రాచీన కట్టడాలను పరిరక్షించడానికి ఇన్ఫోసిస్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమని, ప్రాచీన కట్టడాలను భావితరాలకు తెలియజేయడానికి స్వచ్ఛంద సంస్థలు వాటిని పునరుద్ధరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా నాగన్న బావికి వెళ్లడానికి పర్మేషన్ రోడ్డు వేయాలని అధికారులకు చెప్పారు. రోడ్డు కిరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా మొక్కలు నాటాలని సూచించారు. నాలుగు హైమాస్ లైట్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. బావి చుట్టూ నిర్మిస్తున్న రక్షణ కంచెను పరిశీలించారు. త్వరలోనే ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా పునరుద్ధరించబడిన ఈ భావిని ప్రారంభించడం జరుగుతుందని పనులు వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీవో నరేష్, పంచాయతీ రాజ్ డిప్యూటీ ఇఇ గిరి లను ఆదేశించారు.

# జాతీయ పతాక నిర్మాత పింగళి వెంకయ్య

## -నేడు ఆయన జయంతి




జాతీయ పతాక నిర్మాత పింగళి వెంకయ్య ఆగస్ట్ 02, 1878లో కృష్ణా జిల్లా భట్ల పెనుమర్రులో ఆయన జన్మించారు. బొంబాయిలో సైనిక శిక్షణ పొంది ఆఫ్రికా వెళ్లారు. బోయరు యుద్ధంలో పాల్గొ ని తిరిగి వస్తూ అరేబియా, ఆఫ్ఘనిస్తాన్ పర్యటించారు. 1911-44 వరకు బందరు జాతీయ కళాశాలలో అధ్యా పకునిగా పనిచేశారు. మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో భూ గర్భ శాస్త్ర పరిశోధనలు చేసి డిప్లొమా పొందారు. 1924 నుండి 1944 వరకు నెల్లూరులో ఉండి మైకా గురించి పరిశోధనలు చేశారు.బొగ్గు వజ్రంగా మారే విధానాన్ని గురించి 'తల్లిరాయి' అనే పుస్తకం రాశారు. 1916లో 'భారతదేశమునకు ఒక జాతీయ పతాకం' అనే గ్రంథాన్ని రచించారు. ఈ గ్రంథంలో సుమారు 30 రకాల పతాకాలను ప్రదర్శించారు. 1921లో బెజవాడ అఖిల భారత కాంగ్రెస్ మహాసభలు జరిగినప్పుడు గాంధీజీ ఆదేశానుసారం త్రివర్ణ పతాకాన్ని రూపొందించారు. గాంధీ సూచన మేరకు దానిపై రాట్నం గుర్తు చేర్చారు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ సూచనమేరకు రాట్నం స్తానంలో అశోకచక్రం చేర్చబడింది. ఏప్రిల్ 13, 1936 నాటి 'యంగ్ ఇండియా' పత్రికలో గాంధీజీ పింగళి వెంకయ్య ని ప్రత్యేకంగా ప్రశంసించారు.

# తెల్లం వెంకట్రావు యూ టర్నేనా

ఖమ్మం, ఆగస్టు 1, (న్యూస్ పల్స్)భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు దారెటు.. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచి.. మూడు నెలలకే అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో కేటీఆర్‌ను, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వరుసపెట్టి కలవడం చర్చనీయాంశంగా మారింది. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి యూ టర్న్ తీసుకున్నట్లు, తెల్లం కూడా తిరిగి గులాబీ గూటికి చేరుతారని విస్తృత ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రచారంపై ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు కీలక ప్రకటన చేశారు.భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న ఛాంబర్ లో కేటీఆర్, ఇతర ఎమ్మెల్యేలను కలిశారు. దీంతో మరో ఎమ్మెల్యే గద్వాలకు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి కలిసి తాను తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఆ వెంటనే తెల్లం వెంకటరావు కూడా వారిని కలవడం చర్చనీయాంశం అయ్యింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేల్లో కొందరు యూ టర్న్ తీసుకొని మళ్ళీ బీఆర్ఎస్ లో చేరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. తెల్లం వెంకటరావు కూడా చేరతారని గులాబీ పార్టీ వర్గాలు అంటున్నాయి.ప్రస్తుత రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడే తెల్లం వెంకటరావు. అసెంబ్లీ ఎన్నికల ముందు భద్రాచలం కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నం చేశారు. అయితే ఇక్కడ కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే పొడెం వీరయ్య ఉండటంతో సిట్టింగ్ ను కాదని టికెట్ ఇవ్వడం వీలుకాదని కాంగ్రెస్ అధిష్ఠానం చెప్పడంతో ఆయన అంతకుముందే.. బీఆర్ఎస్ నేతలతో మంతనాలు జరిపి, టికెట్ హామీతో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. భద్రాచలం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది సీట్లు ఉంటే, బీఆర్ఎస్ తరఫున గెలిచిన ఏకైక ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు కావడం విశేషం.కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ద్వారా సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో పార్లమెంట్ ఎన్నికల ముందు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. నియోజక వర్గం అభివృద్ధి కోసం పార్టీ మారానని ఆయన తెలిపారు.


# సినిమా తీరు

## ప్రేక్షకుల ముందుకు" రామచ ంద్రుడు"




ప్రొడ్యూసర్ దిల్ రాజు గారి ఆధీనంలో ఎస్‌విసి బ్యానర్ పై కృష్ణవంశీ. ఆయన హీరోగా చిలుకూరి ఆకాష్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన 'అలనాటి రామచంద్రుడు' చిత్రం ఈ నెల 2న ప్రేక్షకుల ముందుకురానుంది. హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మాతలు.'ఈ సినిమాలో నేను సిద్ధు పాత్రలో కనిపిస్తాను. తను రామచంద్రుడులాంటి వాడు. చాలా ఇంట్రోవర్ట్. అతని ప్రేమకథ ఎలాంటి మలుపులు తిరిగిందన్నది ఆద్యంతం ఆసక్తిని పంచుతుంది' అన్నారు మంగళవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఫీల్‌గుడ్ ఫ్యామిలీ డ్రామా ఇది. హృద్యమైన ప్రేమకథగా ఆకట్టుకుంటుంది. ఫ్యామిలీ ఆడియెన్స్ అందరూ చూడాలని కోరుతున్నా. ఈ కథ అనుకున్నప్పుడే కొత్తవారితో సినిమా చేయాలనుకున్నా. ప్రతి ఒక్కరూ తమ పాత్రలకు న్యాయం చేశారు' అన్నారు. దిల్‌రాజుగారికి ఈ సినిమా నచ్చి రిలీజ్ చేయడం ఆనందంగా ఉందని, చక్కటి ఎమోషన్స్‌తో సినిమా అందరిని మెప్పిస్తుందని నిర్మాత శ్రీరామ్ జడపోలు తెలిపారు. ఇదొక క్లాసిక్ లవ్‌స్టోరీగా నిలిచిపోతుందని కథానా యిక మోక్ష పేర్కొంది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.







## కియారా కెవ్వు కేక!

ప్రామిసింగ్ యాక్ట్రెస్ గా సక్సెస్ ఫుల్ సినిమాలతో దూసుకుపోతున్న హీరోయిన్ కియారా అద్వాణీకి సూపర్ క్రేజ్ ఉన్న విషయం తెలిసిందే. పదేళ్ల క్రితం ఫగ్లీ మూవీతో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది ముద్దుగుమ్మ. ఆ తర్వాత సూపర్ స్టార్ మహేష్ బాబు భరత్ నేను మూవీతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. ఇప్పుడు అటు హిందీ.. ఇటు తెలుగులో బిజీ బిజీగా గడుపుతోంది. మ్యారేజ్ అయ్యాక వచ్చిన అవకాశాలు అన్నీ అందుకుని ప్రాజెక్టులపై సైన్ చేస్తోంది కియారా.గత ఏడాది సత్యప్రేమ్ కి కథతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన కియారా.. ప్రస్తుతం చేతి నిండా సినిమాలతో బిజీగా ఉంది. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్, టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ కాంబోలో వస్తున్న వార్-2లో నటిస్తోంది. ఇక సౌత్ లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ లో యాక్ట్ చేస్తోంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ బ్లాక్ బస్టర్ హిట్ మూవీ సలార్ సీక్వెల్ లో నటించనుందట. స్పెషల్ సాంగ్ తోపాటు కీలక పాత్రలో కనిపించనుందని టాక్ వినిపిస్తోంది.అయితే నేడు కియారా బర్త్ డే. దీంతో సోషల్ మీడియాలో ఆమెకు విషెస్ వెల్లువెత్తుతున్నాయి. అదే సమయంలో గేమ్ ఛేంజర్ మేకర్స్.. కియారాకు పుట్టినరోజు విషెస్ తెలిపారు. "గేమ్ ఛేంజర్ టీమ్ తరఫున జాబిలమ్మ కియారా అద్వాణీకి పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆమె వైబ్రంట్ ఎనర్జీ త్వరలో మీ హృదయాలను మంత్రముగ్ధులను చేస్తుంది" అని ట్వీట్ చేశారు. దాంతోపాటు స్పెషల్ పోస్టర్ ను కూడా రిలీజ్ చేశారు. అయితే పోస్టర్ లో శంకర్ మార్క్ క్లారిటీగా కనిపిస్తుందనే చెప్పాలి.క్రేజీ లెహంగా వేసుకున్న కియారా చాలా అందంగా కనిపిస్తోంది. డ్రెస్సింగ్ అదిరిపోయింది. బ్యాక్ గ్రౌండ్ లోని విజువల్స్.. సూపర్ గా ఉన్నాయి. ఇప్పటికే గేమ్ ఛేంజర్ నుంచి రిలీజ్ అయిన జరగండి సాంగ్ లోని స్టిల్ నే మేకర్స్ విడుదల చేశారు. రామ్ చరణ్ బర్త్ డే సందర్భంగా కొన్ని రోజుల క్రితమే మేకర్స్ రిలీజ్ చేసిన జరగండి పాట.. మాస్ ఆడియన్స్ ను ఆకట్టుకుంది.

## అందానికే మరో అందం....



## డబుల్ ఇస్మార్ట్ లో అతని మ్యాజిక్ రిపీట్..!



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పూరీ జగన్నాథ్ ఈ కాంబోలో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ సూపర్ హిట్ గా నిలిచింది. ఐతే ఆ సినిమా తర్వాత రామ్ వరుస సినిమాలు చేస్తున్నా ఏది అంతగా వర్క్ అవుట్ కాలేదు. పూరీ కూడా లైగర్ అంటూ ఒక పాన్ ఇండియా ప్రాజెక్ట్ చేసినా అది కూడా డిజాస్టర్ అయ్యింది. ఐతే మళ్లీ రాం పూరీనే కలిసి ఇస్మార్ట్ శంకర్ రీమేక్ గా డబుల్ ఇస్మార్ట్ చేశారు. ఆగష్టు 15న ఈ సినిమా రిలీజ్ కు రెడీ అయ్యింది. సినిమా ఫస్ట్ కాపీ చూసుకున్న పూరీ అండ్ టీం సూపర్ సాటిస్ఫైడ్ గా ఉన్నారట. రాం తో ఢీ కొట్టేందుకు బాలీవుడ్ యాక్షన్ స్టార్ సంజయ్ దత్ ని రంగంలోకి దించాడు పూరీ జగన్నాథ్. ఈమధ్య సౌత్ సినిమాల్లో బాలీవుడ్ స్టార్స్ హడావిడి ఎక్కువైంది. ఆల్రెడీ ఐ.ఉ.ఈ 2 లో సంజయ్ దత్ అదరగొట్టగా ఇప్పుడు డబుల్ ఇస్మార్ట్ లో కూడా సంజయ్ మార్క్ కనిపించేలా చేస్తున్నారట. ఐతే ఈ సినిమాలో మరో సర్ ప్రైజ్ ఏంటంటే పూరీ ఆఫ్టర్ గ్యాప్ స్టార్ కమెడియన్ అలితో పనిచేశారు. సినిమాలో అలికి సెపరేట్ ట్రాక్ ఉంటుందని తెలుస్తుంది. ఒకప్పుడు పూరీ సినిమా అంటే చాలు అలికి ఒక ప్రత్యేకమైన ట్రాక్ దాన్ని సినిమాలోకి కలుపుతూ సూపర్ గా ప్లాన్ చేశాడు. కానీ పూరీ ఈమధ్య అలిని పక్కన పెట్టాడు. ఐతే డబుల్ ఇస్మార్ట్ కోసం మళ్లీ అలికి ఒక డిఫరెంట్ రోల్ ఇచ్చినట్టు తెలుస్తుంది. ఈమధ్య కాలంలో అలి కూడా సినిమాల పరంగా అలి జోరు తగ్గింది. అందుకే పూరీ ఇచ్చిన పాత్రకు పర్ఫెక్ట్ గా న్యాయం చేస్తూ అలి మరోసారి తన మ్యాజిక్ రిపీట్ చేశాడని అంటున్నారు. పూరీ సినిమాల్లో అలి డిఫరెంట్ రోల్స్ తో మెప్పించిన సందర్భాలు ఉన్నాయి. డబుల్ ఇస్మార్ట్ లో కూడా అటు యాక్షన్ అంశాలతో పాటుగా అలి కామెడీ కూడా అదిరిపోతుందని అంటున్నారు. డబుల్ ఇస్మార్ట్ సినిమా విషయంలో పూరీ కాలిక్యులేషన్స్ ఎక్కడ తగ్గకుండా ప్లాన్ చేశాడని తెలుస్తుంది. సినిమాలో కావ్య థాపర్ హీరోయిన్ గా నటించగా మణిశర్మ అందించిన మ్యూజిక్ కూడా సినిమాపై బజ్ పెంచేలా చేస్తుంది. మరి ఆగష్టు 15న వస్తున్న ఈ డబుల్ ఇస్మార్ట్ సత్తా చాటుతాడా లేదా అన్నది చూడాలి. ఈ సినిమాతో ఎలాగైనా హిట్ ట్రాక్ ఎక్కాలని చూస్తున్నాడు పూరీ జగన్నాథ్.

# పసందైన ఫల రసాలు



అసలే ఎండాకాలం. శరీరం తొందరగా డీహైడ్రేట్ అవుతుంది. మరి ఆరోగ్యం బాగుండాలంటే నీళ్లు ఎక్కువగా తాగడమేకాదు.. ఖనిజ లవణాలు అధికంగా ఉండే జ్యూస్‌లనూ తీసుకోవాలి. ఎప్పుడూ ఒకేలాంటి జ్యూస్‌లు తీసుకుంటే ఎలా? ఒక్కో పండులో ఒక్కో ప్రత్యేకమైన పోషకాలు ఉంటాయి. అన్నిరకాల పండ్లతో జ్యూస్‌లు తీసుకుంటే శరీరానికి శక్తి అందుతుంది. అందుకే మీకోసం కొన్ని వెరైటీ జ్యూస్‌లు ఎలా తయారుచేయాలో చూద్దాం..!


ద్రాక్షతో.. కావాల్సిన పదార్థాలు : ద్రాక్ష - కిలో తయారుచేసే విధానం : ద్రాక్షని గుత్తుల నుంచి వేరు చేసుకుని శుభ్రంగా కడిగి, పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక గిన్నె తీసుకుని అందులో ద్రాక్షని వేసుకుని మీడియం మంటపై పావుగంటసేపు ఉడికించుకోవాలి. ఇలా ఉడికేటప్పుడు గరిటెతో తిప్పుతూ.. మధ్య మధ్యలో ద్రాక్షని గట్టిగా ఒత్తుతూ ఉడకబెట్టుకోవాలి. ఇలా గట్టిగా ఒత్తితే అవి విత్తనాల నుంచి వేరయి పోయి జ్యూస్‌లా అవుతుంది. అలా ఉడికిన ద్రాక్షని జ్యూస్ వడకట్టే దానితో వేరే గిన్నెలోకి వడకట్టు కోవాలి. అంతే ద్రాక్ష జ్యూస్ రెడీ. ఇలా చేసిన ద్రాక్ష జ్యూస్‌ని కొన్ని గంటలపాటు తాజాగా ఉంటుంది. ఒకవేళ నైట్ చేసుకున్నా తెల్లారేదాకా ఉంటుంది. దీనిలో కొద్దిగా నీళ్లు కలుపుకుని తాగొచ్చు. లేదా నీళ్లు, తేనెగానీ, పంచదారగానీ కలుపుకుని తాగొచ్చు. పుచ్చకాయతో.. కావల్సిన పదార్థాలు : పుచ్చకాయ - ఒకటి (మీడియం సైజ్), అల్లం రసం - అర టేబుల్ స్పూను, నిమ్మరసం - టేబుల్‌స్పూను, తాజా పుదీనా ఆకులు - రెండు లేదా మూడు, తేనె - రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు - చిటికెడు, ఐస్ క్యూబ్స్ - కొద్దిగా. తయారుచేసే విధానం : పుచ్చకాయను శుభ్రంగా కడిగి, ఎర్రటి భాగాన్ని ముక్కలుగా కోసుకుని, వాటిని మిక్సీజార్‌లో వేసి, కొన్ని ఐస్‌క్యూబ్స్ వేసుకోవాలి. అలాగే నిమ్మరసం, అల్లం రసం, ఉప్పు, తేనె అన్నింటినీ వేసి జ్యూస్‌లా చేసుకోవాలి. ఈ జ్యూస్‌ని గ్లాసుల్లోకి పోసుకొని తీసుకోబోయే ముందు కొన్ని ఐస్‌క్యూబ్స్, పైన పుదీనా ఆకులతో గార్నిష్ చేసుకుని తాగితే టేస్టీగానూ ఆకర్షణీయంగానూ ఉంటుంది. దానిమ్మతో.. కావల్సిన పదార్థాలు : దానిమ్మకాయలు - ఐదు లేక ఆరు తయారుచేసే విధానం : ముందుగా దానిమ్మకాయలని కోసి వాటిలోని విత్తనాలని తీసుకుని చల్లటి నీటిలో అరగంటసేపు ఉంచాలి. తర్వాత మిక్సీజార్‌లో దానిమ్మ గింజలని వేసుకుని పదిహేను, ఇరవై నిమిషాలపాటు జాగ్రత్తగా పేస్ట్ చేసుకోవాలి. ఇందులో నీటిని కలుపుకోకుండా జ్యూస్‌లా చేసుకోవాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని జ్యూస్ వడకట్టే దానితో వేరే గిన్నెలోకి వడకట్టుకోవాలి. ఈ జ్యూస్‌ని ఫ్రిజ్‌లో పెట్టుకుంటే ఐదు, ఆరు రోజులు నిల్వ ఉంటుంది. మీరు తీసుకోబోయే ముందు కొద్దిగా నిమ్మరసం, పంచదార లేకపోతే తేనె, ఐస్‌క్యూబ్స్ వేసుకుని, తాగితే చాలా టేస్టీగా ఉంటుంది. నారింజతో.. కావల్సిన పదార్థాలు : నారింజపండ్లు- ఆరు లేదా ఏడు, నిమ్మరసం, పంచదార, తేనె, బెల్లం ఏదైనా సరే.. - రుచికి తగినంత. తయారుచేసే విధానం : నారింజకాయల్ని తొనలుగా తీసుకుని వాటిలో కొద్దిగా నిమ్మరసం కలిపి మిక్సీజార్‌లో వేసి జ్యూస్‌లా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని స్టౌపై పాన్ పెట్టి అందులో వేసి పది నిమిషాలపాటు ఉడికించుకోవాలి. అందులో పంచదార కానీ, తేనె, కానీ, బెల్లం కానీ మీకిష్టమైనది వేసుకోవచ్చు. ఇది చల్లారాక గ్లాసుల్లో పోసుకుని, తాగవచ్చు. అలాగే ఇది కూడా కొన్ని గంటలపాటు నిల్వ ఉంటుంది. దీన్ని అలాగే తాగాలనుకుంటే తాగొచ్చు. లేకపోతే నారింజ జ్యూస్ సగం తీసుకుని, సగం నీటిని కలుపుకునీ తాగొచ్చు. చిక్కగా ఉంటుంది. కాబట్టి నీటిని కలుపుకున్నా టేస్టీగానే ఉంటుంది. మామిడి, సపోటాతో.. కావల్సిన పదార్థాలు : సపోటా - ఐదు లేక ఆరు, మామిడిపండు - ఒకటి (మీడియం సైజుది) పాలు - రెండు గ్లాసులు, పంచదార - మూడు లేదా నాలుగు టేబుల్‌స్పూన్లు, ఐస్ క్యూబ్స్ - నాలుగు లేక ఐదు. తయారుచేసే విధానం : ముందుగా సపోటాపైనున్న తోలు, లోపల గింజలు తీసేయాలి. లోపల గుజ్జు వరకు వేరుచేసి పక్కన పెట్టుకోవాలి. అలాగే మామిడిపై తొక్కని, తీసేసి ముక్కలుగా కోసుకోవాలి. ఇప్పుడు మిక్సీజార్‌లో సపోటా గుజ్జు, మామిడికాయ ముక్కలు, పాలు, పంచదార, ఐస్‌క్యూబ్స్ వేసుకుని జ్యూస్‌లా చేసుకోవాలి. అంతే మామిడి సపోటా జ్యూస్ రెడీ అయినట్టే. దీన్ని తీసుకోబోయే ముందు డ్రై ఫ్రూట్స్.. చల్లగా కావాలనుకుంటే మరికొన్ని ఐస్‌క్యూబ్స్ వేసుకోవచ్చు. వడదెబ్బ తగలకుండా కాపాడతాయి జ్యూస్‌లో మంచి లవణాలతోపాటు ఫైబర్ ఉంటుంది. ఇవి రోగనిరోధక శక్తిని కలిగి ఉంటాయి. వీటిలో విటమిన్- ఇ కూడా ఉంటుంది. ఇవి శరీరానికి తక్షణ శక్తిని ఇవ్వగలవు. ద్రాక్ష జ్యూస్ చర్మానికి, గుండెకు మంచిది. నారింజ జ్యూస్ గర్భిణీలకు, అధిక కొలెస్ట్రాల్ ఉన్న వారికి మంచిది. దానిమ్మ జ్యూస్ గుండెకు మంచిది. ఇది మంచి యాంటిబయోటిక్‌గా పనిచేస్తుంది. బిపి ఉన్నవారికీ చాలా మంచిది. పుచ్చకాయలో ఉప్పుశాతం, విటమిన్-సి,ఎన్‌తో పాటుగా ఫైబర్ ఉంటుంది. నిమ్మకాయ రసం చాలా మంచిది. మామిడి అధిక కెరోటినాయిడ్స్, అధిక లవణాలు ఉంటాయి. ఇవి వడదెబ్బ తగలకుండా మనల్ని కాపాడతాయి. సపోటా జ్యూస్ అధిక శక్తినిస్తుంది. ఇది ఫైబర్‌ను అభివృద్ధి చేయడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

## మాజీ క్రికెటర్ అన్షుమన్ గైక్వాడ్ కన్నుమూత



ముంబై: టీమ్‌ఇండియా మాజీ ఆటగాడు, హెడ్ కోచ్ అన్షుమన్ గైక్వాడ్ కన్నుమూశారు. గత కొంతకాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన బుధవారం తుదిశ్వాస విడిచారు. 1983లో ప్రపంచకప్ నెగ్గిన భారత జట్టులో సభ్యుడైన గైక్వాడ్.. 1974-87 మధ్య 12 ఏండ్ల సుదీర్ఘ కేరీర్‌లో 40 టెస్టులు, 15 వన్డేలు ఆడారు. మొత్తం 2254 పరుగులు చేశారు. వాటిలో రెండు సెంచరీలు ఉన్నాయి. 1983లో జలంధర్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 201 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచారు. కెరీర్‌లో 205 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడారు. టీమ్‌ఇండియాకు రెండుసార్లు.. 1997 నుంచి 1999 వరకు, 2000లో భారత జట్టుకు కోచ్‌గా సేవలందించారు. ఆయన కోచ్‌గా ఉన్న సమయంలోనే 2000 ఐసీసీ చాపియన్స్ ట్రోఫీలో భారత్ రన్నరప్‌గా నిలిచింది. 1999లో ఢిల్లీలోని ఫిజ్‌షా కోట్లా స్టేడియంలో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో అనిల్ కుంబ్లే పదికి 10 వికెట్లు పడగొట్టింది ఆయన హయాంలోనే. 1990ల్లో జాతీయ టీమ్ సెలెక్టర్‌గా, ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్‌కి అధ్యక్షుడిగా పనిచేశారు.అన్షుమన్ గైక్వాడ్ మరణం పట్ల ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. క్రికెట్‌కు గైక్వాడ్ అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని, తను మరణించారన్న వార్త బాధ కలిగిస్తోందని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. బీసీసీఐ కార్యదర్శి జైషా, మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీతోపాటు పలువురు క్రికెటర్లు ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు.కాగా, గైక్వాడ్ క్యాన్సర్ చికిత్సకు సంబంధించి ఆర్థిక సమస్యలు తలెత్తడంతో ఆదుకోవాలని దిగ్గజ కెప్టెన్ కపిల్ దేవ్ బీసీసీఐకి విన్నవించిన సంగతి తెలిసిందే. దీంతో స్పందించిన బీసీసీఐ గైక్వాడ్ చికిత్సకు తక్షణం సాయం కింద రూ.కోటి ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. అయితే ఈలోపే ఆయన చికిత్స పొందుతూ ఆయన కన్నుమూశారు.

## పారిస్ ఒలింపిక్స్ నుంచి బాక్సర్ నిఖత్ జరీన్ ఔట్




పారిస్: బాక్సింగ్ ప్రపంచ ఛాంపియన్ నిఖత్ జరీన్ పారిస్ ఒలింపిక్స్ లో చేతులెత్తేసింది. 50 కేజీల విభాగంలో పోటీపడ్డ నిఖత్ జరీన్.. ఆసియా స్వర్ణ పతక విజేత, చైనాకు చెందిన వూ యూ చేతిలో ఓటమిపాలైంది. ప్రీ క్వార్టర్స్‌లో 5-0 తేడాతో నిఖత్ బాక్సింగ్ బౌట్‌ను కోల్పోయింది. పారిస్ ఒలింపిక్స్‌లో అన్‌సీడెడ్‌గా నిఖత్ పోటీలో దిగింది. తన రేంజ్‌ను అందుకోవడంలో ఆమె ఇబ్బంది పడింది. నిఖత్ పంచ్‌లు వెలవెలబోయాయి. 52 కిలోల ఫ్లయ్‌వెయిట్‌లోనూ ప్రపంచ చాంపియన్ అయిన చైనా క్రీడాకారిణి.. బౌట్ మొత్తం ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మెగా గేమ్స్‌లో మెడల్ సాధిస్తుందని అనుకున్నా.. నిఖత్‌కు రెండో రౌండ్‌లోనే బలమైన ప్రత్యర్థిని ఎదుర్కోవాల్సి వచ్చింది. తొలి రౌండ్‌లో జర్మనీ బాక్సర్ మాక్సీ కరీనా కోయిజర్‌పై నిఖత్ గెలుపొందింది.

## హాకీ గ్రూప్ స్టేజ్.. బెల్జియం చేతిలో ఓడిన ఇండియా



పారిస్: పారిస్ ఒలింపిక్స్ హాకీలో డిఫెండింగ్ ఛాంపియన్ బెల్జియం చేతిలో ఇండియా ఓటమి పాలైంది. 2-1 తేడాతో బెల్జియం స్టన్నింగ్ విక్టరీ కొట్టింది. వాస్తవానికి ఆరంభంలో ఇండియానే ఆధిక్యంలో ఉన్నా.. టోక్యో మెడలిస్ట్ బెల్జియం అద్భుతమైన ఆట తీరును ప్రదర్శించింది. భారత్ తరఫున అభిషేక్ ఒక్కడే గోల్ చేశాడు. తొలి రెండు క్వార్టర్లలో భారత్ దూకుడు ప్రదర్శించినా.. కీలకమైన చివరి రెండు క్వార్టర్స్‌లో బెల్జియం ఆటగాళ్లు జోరు పెంచారు. రాజ్ కుమార్ పాల్‌కు ఎల్లో కార్డు ఇవ్వడం వల్ల.. చివరి నిమిషాల్లో ఒక ఆటగాడు లేకుండానే ఇండియా ఆడాల్సి వచ్చింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.